క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ లైన్ పనులు జరుగుతున్న ప్రాంతాలైన ఫారెస్టు ఆఫీస్ రోడ్డు, మిర్యాలగూడ రోడ్డు, శివాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

నల్లగొండ టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చడం కోసం తీవ్ర ప్రయత్నం చేస్తోందని రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లూరి నర్సింహ అన్నారు. సోమవారం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక మగ్దూం భవన్‌లో రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బు వీరస్వామి, దళిత హక్కుల పోరాట సమితి కన్వీనర్ లింగయ్య, బలపట్ల వెంకన్న, జిల్లా సత్యం, సుజాత, కౌసల్య, విజయ్, రామకోటి, ముత్యాలు, వెంకన్న, లెనిన్ పాల్గొన్నారు.

తిప్పర్తి తహసీల్దార్‌గా పరశురాములు



తిప్పర్తి : మండల తహసీల్దార్‌గా కొత్తపల్లి పరశురాములు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ స్వప్న బదిలీపై వెళ్లారు.

నూతన ఏఓగా సాహస్



మర్రిగూడ : మండల వ్యవసాయ అధికారిగా ఎం.సాహస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన హేమలత దేవరకొండకు బదిలీపై ఏఓ వెళ్లారు. కాగా సూర్యాపేటలో ఏఈఓగా పనిచేసి టీజీపీఎస్సీ పరీక్షలో ఏఓగా ఎంపికైన సాహస్ మర్రిగూడకు వచ్చారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

కేతేపల్లి: మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామంలో 65 నంబరు జాతీయ రహదారి వెంట గల బంగారు మైసమ్మ ఆలయంలో మంగళవారం నుంచి రెండు రోజులపాటు ఆలయ ఎనిమిదో వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నెల 18వ తేదీన దేవతామూర్తుల కల్యాణం, ఆలయ ఆవరణలో చండీయాగం, హోమాలు, 19న అమ్మవారికి బోనాల సమర్పణ, భక్తుల మొక్కుల చెల్లింపు ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ ముదిరెడ్డి యాదగిరిరెడ్డి తెలిపారు.

మల్టీపర్పస్ వర్కర్ మృతి

మర్రిగూడ : మండలంలోని కొట్టాల గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ ఉబ్బు నరసింహ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య సోమవారం నరసింహ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపిక



శంకర్‌రెడ్డి

కట్టంగూర్ : తెలంగాణ సంక్షేమ వసతి గృహాల్లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగ నియామక ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) సోమవారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో మండలంలోని పామనగుండ్ల గ్రామానికి చెందిన గుజ్జుల శంకర్‌రెడ్డి 300 మార్కులను గాను 198.48 మార్కులు సాధించి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు.

జీర్ణోద్ధరణ వేడుకలు

చండూరు (గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రలంలోని మార్కండేయ స్వామి ఆలయంలో సోమవారం జీర్ణోద్ధరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ మాడా పాపయ్య శర్మ, పురాణమఠం శివానందం, సుధాకర్ శర్మ, వెంకటరమణ శర్మ, విద్యాసాగర్, పవన్ శర్మ ఆధ్వర్యంలో జీవన్యాసము, విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి నిర్వహించారు. వేడుకల్లో ఈమని శివనాగిరెడ్డి, శిల్పి భీమిరెడ్డి నాగిరెడ్డి, జెల్ల షణ్ముఖి, అవ్వారి శ్రీనివాస్, ఇడం భాస్కర్, ఇడం శ్రీనివాస్, వెంకటేశం, భాస్కర్, సూర్యకాంత్, నరేందర్, దోర్నాల అంజయ్య, పున్న నర్సింహ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

శాలిగౌరారం : సూర్యాపేటలోని పద్మశాలి భవన్‌లో ఈ నెల 19, 20వ తేదీల్లో భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఐక్య ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న పిలుపునిచ్చారు. సోమవారం మండలకేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ముందస్తుగా బడిబాటకు శ్రీకారం

- విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచడమే ధ్యేయం
- పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఇంటింటి ప్రచారం
- అంగీకార పత్రాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు



చందంపల్లిలో బడిబాటలో పాల్గొన్న ఎంఈఓ నాగయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు

నకిరేకల్ : మండలంలోని చందంపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు వినూత్నంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ప్రతి ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తోంది. కాగా చందంపల్లిలో మాత్రం రాబోయే విద్యా సంవత్సరం అడ్మిషన్ల కోసం ముందస్తుగా వారం రోజులపాటు బడి బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం ఎంఈఓ మేకల నాగయ్య ప్రారంభించారు.

ఇంటింటికీ కరపత్రాల పంపిణీ

చందంపల్లి గ్రామలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి 7వ తరగతి వరకు ఉంది. గతంలో ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 100కు పైనే ఉంది. కానీ ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 25 మించి లేదు. హెచ్ఎంతో కలిపి ఉపాధ్యాయులు ఐదుగురు పని చేస్తున్నారు. గ్రామస్తులు తమ పిల్లలను ఎక్కువ సంఖ్యలో నకిరేకల్‌లోని ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. దీంతో వచ్చే ఏడాది ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచడం కోసం పాఠశాల హెచ్ఎం కె.నవీన్‌రెడ్డి ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. శ్రద్ధ చూపి మన ఊరి ప్రభుత్వ పాఠశాలలో మన పిల్లలను చదివిద్దాం.. నాణ్యమైన సమానమైన విద్యను ఉచితంగా పొందుదాం..అంటూ ప్రచార కరపత్రాలను ప్రచురించారు. విద్యా సంవత్సరం ముగుస్తున్న సమయంలో చందంపల్లి గ్రామంలో ఆపాఠశాల ఉపాధ్యాయులు కొత్తగా బడిబాట కార్యక్రమం పేరుతో ప్రతి ఇంటికి వెళ్లి గ్రామస్తులకు కరపత్రాలు అందజేస్తున్నారు. వచ్చే ఏడాది గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను పంపాలని విద్యార్థుల తల్లిదండ్రులను వేడుకుంటున్నారు. ఉపాధ్యాయులు తమ విద్యార్హతలను కరపత్రంలో ప్రచురించి ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలను వివరిస్తున్నారు. శనివారం నిర్వహించిన బడిబాటలో 10 మంది పేరెంట్స్ నుంచి పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు పంపుతామని ఉపాధ్యాయులు అంగీకార పత్రాలు తీసుకున్నారు.

ఎన్‌రోల్‌మెంట్ పెంచడమే లక్ష్యం



వేసవి సెలవుల్లో ప్రైవేటు పాఠశాలల వారు వచ్చి పిల్లలను అడ్మిషన్లు తీసుకుంటారు. ముందుస్తుగానే పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలకు పంపాలని మేమంతా సమష్టిగా గ్రామస్తుల్లో చైతన్యం కల్పించేందుకు కృషి చేస్తున్నాం. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచడమే మా లక్ష్యం.

–కె.నవీన్‌రెడ్డి, హెచ్ఎం, ప్రాథమికోన్నత పాఠశాల, చందంపల్లి

ఎల్ఆర్ఎస్ చెల్లించినవారికి రాయితీ



ప్రొసీడింగ్ అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు ఈ నెల 31లోగా ఎల్ఆర్ఎస్ చెల్లించిన వారికి 25 శాతం రాయితీ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. రెగ్యులరైజేషన్ కోసం డబ్బులు చెల్లించిన నలుగురు లబ్ధిదారులకు సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి 25 శాతం రాయితీకి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు



నల్లగొండ టౌన్: నిరాహార దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

నల్లగొండ టౌన్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టరూపం దాల్చేవరకు రాష్ట్రంలో గ్రూప్స్ ఉద్యోగ ఫలితాలు, నియామకాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 7వ రోజు చేరాయి. కార్యక్రమంలో బకరం శ్రీనివాస్, ఇరిగి శ్రీశైలం, కురుపాటి కమలమ్మ, పెరికే శ్రీనివాసులు, జలందర్, రణవీర్, మల్లెపల్లి రాంబాబు, మాసారం వెంకన్న, పోలే జయకుమార్, తలకొప్పుల గిరి పాల్గొన్నారు.

శాలిగౌరారం : ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు శాలిగౌరారంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో శనివారం కొనసాగాయి. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ బోడ సునీల్, మండల ఇన్‌చార్జి కారుపాటి అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో ఎన్నికలు దేశానికి శ్రేయస్కరం



మాట్లాడుతున్న గోలి మధుసూదన్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: ఏకకాలంలో ఎన్నికలు జరగడం దేశానికి శ్రేయస్కరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థల ఎన్నికలను వివిధ సందర్భాల్లో నిర్వహించడం వల్ల చాలా ఖర్చు, సమయం వృథా అవుతుందన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ వల్ల ఎన్నికల కోడ్ సమయంలో పలు అభివృద్ధి పనులు నిలిచిపోకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వన్ నేషన్–వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ చనమోని రాములు, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, సాధినేని శ్రీనివాస్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, కొండేటి సరిత, ఎడ్ల రమేష్, రేపాల పురుషోత్తంరెడ్డి, వెంకన్న, దూదల భిక్షం గౌడ్, నాగిరెడ్డి, రావెళ్ళ కాశమ్మ, మిర్యాల వెంకన్న పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

తిప్పర్తి : జిల్లా వ్యాప్తంగా వరి పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. సోమవారం తిప్పర్తి మండలంలోని మామిడాల గ్రామంలో పంటలు ఎండిపోయిన రైతులను, ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన అనుములపురి నవీన్‌ను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మామిడాల గ్రామంలో ఇటీవల బీజేపీ నాయకులు వచ్చినప్పుడు రైతు నవీన్ తన గోడు విన్నవించుకున్నాడని, దీంతో మరుసటి రోజు మంత్రి కోమటిరెడ్డి గ్రామానికి వస్తున్నారని పోలీసులు నవీన్‌ను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వంగూరి రవి, నాయకులు మైనం మల్లయ్య, గంగాధర్, శివశంకర్, రమేష్, వెంకటేశ్వర్లు, శ్రవణ్, మహేష్, బ్రహ్మచారీ, బత్తిని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

‘లెప్రసీ’ని ముందస్తుగా గుర్తించేందుకు సర్వే



సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

తిప్పర్తి: కుష్టువ్యాధిపై నిర్వహిస్తున్న ఎల్‌సీడీసీ(లెప్రసి కేర్ డిటెన్షన్ క్యాంపెయిన్) సర్వేను వేగవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. మండలంలోని దుప్పలపల్లి గ్రామంలో సోమవారం సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే ఈ నెల 30 వరకు సర్వే పూర్తి చేయాలన్నారు. సమాజంలో లెప్రసీ వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి, ముందస్తుగా లెప్రసీ గుర్తించడానికి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సబ్ సెంటర్‌లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి, డా.ప్రదీప్‌బాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



కనగల్ : సమగ్ర సర్వేలో పాల్గొన్న నాయకులు

శాలిగౌరారం : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య అన్నారు. ప్రజా సమస్యలపై సీపీఎం పోరుబాట కార్యక్రమంలో సోమవారం మండలంలోని అంబారిపేటలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండల స్పెషల్ అధికారి, పంచాయతీ కార్యదర్శిని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో చలకాని కుమార్, నూనె గట్టయ్య, చలకాని శ్రీశైలం, నూనె నరేష్, మాగి నర్సయ్య, చలకాని అంజయ్య పాల్గొన్నారు.

24 నుంచి దీక్షలు

రామగిరి(నల్లగొండ): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24, 25, 26 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న రిలే దీక్షలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున పిలునిచ్చారు. సీపీఎం ప్రజా పోరు యాత్రలో భాగంగా నల్లగొండ మండలం వెలుగుపల్లి, ముషంపల్లి గ్రామాల్లో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండా అనురాధ, నల్లగొండ మండల కార్యదర్శి నలపరాజు సైదులు మండల కమిటీ సభ్యులు జిల్లా అంజయ్య, కొండా వెంకన్న, పోలె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

కనగల్ : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పాలడుగు ప్రభావతి పిలుపునిచ్చారు. సోమవారం పర్వతగిరి, దర్వేశిపురం గ్రామాల్లో నిర్వహించిన సమగ్ర సర్వేలో ఆమె పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు నెలగొండరాశి లింగయ్య, ఎండీ సుల్తానా, రాములు, లింగయ్య, వెంకటయ్య, శ్రీరాములు, నర్సింహ, సైదులు, వెంకన్న, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

రామగిరి(నల్లగొండ): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 19వ తేదీన డీఈఓ కార్యాలయం ఎదుట జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి పోలే సత్యనారాయణ పిలుపునిచ్చారు. నల్లగొండ మండలంలోని ముషంపల్లి, రసూల్‌పుర, వెలుగుపల్లి, అన్నారం గ్రామాల పాఠశాల్లో పనిచేస్తున్న కార్మికులను సోమవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫాతిమా, బుచ్చమ్మ, ఎలమ్మ, అమీనా, గౌరె సత్తెమ్మ, బరిగల అలివేలు, పోతెపాక లింగమ్మ, కె.సైదమ్మ, అండాలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మునుగోడు: మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందన ఐతగోని రవికి మంజూరైన రూ.50వేలు, మాలిగా శేఖర్‌కు రూ. 20వేలు, తలారి శివమణికి రూ.20వేలు, తలారి దుర్గాప్రసాద్‌కు మంజూరైన రూ.18వేల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మందుల బీరప్ప, ఆ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు దండు లింగస్వామి, వల్లూరి యాదయ్య, శిల్కరాజు, నర్సింహ, గంజి ధనంజయ్య, చందు, లక్ష్మయ్య, కుతాటి నాగార్జున, శ్రీశైలం, బొల్ల సుదర్శన్, గంజి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి



చిట్యాల: ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

రామగిరి (నల్లగొండ): ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోలె సత్యనారాయణ, ఎర్ర సౌజన్య, ఎడవెల్లి ప్రేమలత, సీహెచ్ వీరభద్రమ్మ, రేణుక, ధనుంజయ్ పాల్గొన్నారు.

కట్టంగూర్ : ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇస్తూ పీఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ గుగులోతు ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో తవిటి వెంకటమ్మ, ధనలక్ష్మి, జానకి, శోభ, పుష్పాంజలి, రేణుక, అనిత, సునిత, జ్యోతి, మంగమ్మ, పార్వతమ్మ, సుజాత ఉన్నారు.

చిట్యాల: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్‌లు సోమవారం చిట్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ కృష్ణ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, బీజేపీ నాయకుడు చికిలంమెట్ల అశోక్, గంగుల జయమ్మ, సైదమ్మ, పుష్పలత, భాగ్యమ్మ, లక్ష్మీ, రేణుక, సైదమ్మ, రాములు, ఇద్దయ్య పాల్గొన్నారు.

చండూరు : ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం నిర్ణయించాలని, అర్హులైన వారికి సెకండ్ ఏఎన్ఎంలుగా ప్రమోషన్లు కల్పించాలని సీఐటీయూ చండూరు మండల కన్వీనర్ జెర్రిపోతుల ధనంజయ ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చండూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు ఆశా కార్యకర్తల సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ధనంజయ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పని భారం తగ్గించాలని, కరోనా రిస్క్ అలవెన్స్ బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిట్టిమల్ల లింగయ్య, ఈరటి వెంకటయ్య, జ్యోతి, పద్మ, విజయలక్ష్మి, నాగమణి, పరమేశ్వరి, సీహెచ్ రోజా, లలిత, సుమలత, వేదవతి, నాగమణి, జ్యోతి, జయమ్మ, లక్ష్మి, దుర్గ, స్వప్న, భవాని, రాణి, పద్మ, అలివేలు, సుజాత, సంతోషి, నాగలక్ష్మి, పాల్గొన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



నార్కట్‌పల్లి : అమ్మనబోలు పాఠశాలలో పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు



కేతేపల్లి : తుంగతుర్తి హైస్కూల్‌లో..

కనగల్ : విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని పల్ రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ దేప నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చిన్న మాదారం ఉన్నత పాఠశాలలో జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి వారు అతిథులుగా హాజరై మాట్లాడారు. పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు వల్లపట్ల పద్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపాధ్యాయులు ఎజాజ్ హుస్సేన్, రమేష్‌రెడ్డి, రజిత, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, మధు, నరేందర్‌రెడ్డి, హిందు రాణి, శశిరేఖ, సరిత, వాసు, ఉమా, రాజుపాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

చిట్యాల: పదో తరగతి వార్షిక ఫలితాల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని పెద్దకాపర్తి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం లుకేందర్‌రెడ్డి అన్నారు. పెద్దకాపర్తి జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులకు విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధ, యశోధర, యుగేందర్‌రెడ్డి, బ్రహ్మయ్య, రవీందర్, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌లు అందజేత

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ సమకూర్చిన పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను సోమవారం ఆ పాఠశాల హెచ్ఎం బి.వెంకట్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.స్వామి, ఏ.నాగయ్య, ఎస్‌కె.లతీఫ్, ఎస్.సైదులు, పి.కృష్ణమూర్తి, శివసాయి పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..

శాలిగౌరారం : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులను సోమవారం ఎస్ఐ సైదులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కోట మల్లయ్య, డీవైఎఫ్ఐ మండల కన్వీనర్ బట్ట సైదులు, కుమార్, అనిల్, వెంకటేష్, అంకిరెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మనబోలులో..

నార్కట్‌పల్లి : అమ్మనబోలు జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అమ్మనబోలు స్టూడెంట్ ఫౌండేషన్(ఏఎస్ఐ) ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష సామగ్రిని నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేఖర్‌రెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ చింతకాయల పుల్లయ్య, రమేష్, శివ, గణేశ్, సతీష్, కిరణ్, నాగరాజు, శ్రీకాంత్, శ్రవణ్ ఉన్నారు.

కేతేపల్లి : మండలంలోని తుంగతుర్తి హైస్కూల్‌లో విద్యార్థులకు హెచ్ఎం అశోక్‌రెడ్డి పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు గొప్ప లక్ష్యాలను ఎంచుకోవాలి

నల్లగొండ: విద్యార్థులు గొప్ప లక్ష్యాలను ఎంచుకోవాలని నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి అన్నారు. సోమవారం మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకల బాలికల పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య, వన్ టౌన్ ఎస్ఐ సైదులు, ఏటీపీ సంధ్యా రాణి, శిరీష, నళిని, దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

45 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కేతేపల్లి: మినీ వాహనంలో 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని భువనగిరికి తరలిస్తుండగా సోమవారం కేతేపల్లి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కేతేపల్లి మండలంలోని ఇనుపాముల మల్లన్నగుట్ట వద్ద సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా.. సూర్యాపేట నుంచి హైదరాబాద్ వైపు రేషన్ బియ్యం లోడుతో వెళ్తున్న మినీ వాహనాన్ని పట్టుకున్నారు. విచారణలో భాగంగా వేములపల్లి మండలం రావులపెంట గ్రామానికి చెందిన ధరావత్ అరుణ్, లావుడ్య రాజ్‌కుమార్ రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని భువనగిరికి తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు నిందితులతో పాటు రేషన్ బియ్యం, వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న అరుణ్, రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివతేజ తెలిపారు.

తప్పిపోయిన బాలికను కుటుంబ సభ్యులకు అప్పగింత

నల్లగొండ: నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్ అర్బన్ కాలనీకి చెందిన బూర్ల శాంసన్, మరియమ్మ దంపతుల కుమార్తె సౌమ్య సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి దారి మర్చిపోయి బస్టాండ్ దగ్గరలో తిరుగుతుండగా.. స్థానికులు గమనించి డయల్ 100కు సమాచారం ఇచ్చారు. దీంతో నల్లగొండ టూటౌన్ పోలీసులు సదరు బాలికను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం షేర్ చేశారు. సౌమ్య బంధువులు చూసి వెంటనే టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. పోలీసులు బాలికను వారికి అప్పగించారు. బాలిక తల్లిదండ్రులు, బంధువులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలికల రక్షణకు షీ టీమ్

కట్టంగూర్ : బాలికల రక్షణకు షీ టీమ్ కృషి చేస్తోందని మహిళా విభాగం ఏఎస్ఐ సఫియా సుల్తానా అన్నారు. సోమవారం మండలంలోని దుగినవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం పోలీసు కళా బృందం మహిళా రక్షణ, రోడ్డు భద్రతా నియమాలు, బాల్యవివాహాల నిర్మూలనపై కళాజాతా నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మి, హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు కరుణాదేవి, మురళయ్య, లలిత జ్యోతి, శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి, సలీం, లీలావతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి



సోమయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జన శక్తి నేత అమర్ తదితరులు

నకిరేకల్ : అమరుల ఆశయ సాధనకు కృషిచేయాలని జనత శక్తి నేత అమర్ అన్నారు. నకిరేకల్ పట్టణానికి చెందిన సారధి కళాకారిణి, గాయని పల్స నిర్మల తండ్రి చీటూరి సోమయ్య ఇటీవల మృతి చెందారు. సోమవారం జరిగిన సంతాప సభలో అమర్ పాల్గొని సోమయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ దోపిడీ, పీడన అసమానతలు రద్దు కావాలని జీవితమంగా పోరాడిన సోమయ్య జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, స్థానిక ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప, కౌన్సిలర్ గాజుల సుకన్య, డాక్టర్ చెరుకు సుధాకర్, దైద రవీందర్, గాజుల శ్రీనివాస్, గూడురు జానకిరామ్‌రెడ్డి, పర్వతాలు, బొమ్మకంటి కొమరయ్య, కప్పల వసంత, పటోళ్ల నాగిరెడ్డి, కప్పల వసంత, పల్స గిరి, బుల్లెట్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మర్రిగూడ : మండలంలోని కొట్టాల గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్ ఉబ్బు నరసింహ (34) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సోమవారం మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, మాజీ సర్పంచ్ గంటా కవిత యాదయ్యలతో రూ.20వేలు పంపించారు. అదే విధంగా ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఎంపీఓ రవికుమార్‌తో కలిసి రూ.10వేలు అందజేశారు. కొట్టాల సీపీఐ గ్రామశాఖ ఆధ్వర్యంలో రూ.10వేలు అందజేశారు.

మర్రిగూడ : మండలంలోని మేటిచందాపురం గ్రామపంచాయతీ పరిధి ఇందుర్తి గ్రామానికి చెందిన గిరి మారయ్య అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ ఊరిపక్క సరితనగేష్... మారయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందజేశారు.

శాలిగౌరారం : మండల కేంద్రానికి చెందిన ఈర్ల సైదులు అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. సైదులు మృతదేహాన్ని గుండ్లపల్లి వెంకన్న సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.